సునామీ సృష్టించిన కూటమి..

ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు కూటమి కట్టాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేశాయి. ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల జనసేనకు, విజయనగరం పార్లమెంట్ స్థానం పరిధిలో ఒక అసెంబ్లీ సీటును బీజేపీకి ఇచ్చారు. దీనివల్ల మూడు పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరగదని, చాలా సులువుగా విజయం సాధించవచ్చని వైసీపీ భావించింది. భారీ మెజార్టీలను అంచనా వేసింది. కానీ అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. నెల్లిమర్లలో జనసేన అభ్యర్థి లోకం నాగామాధవికి టీడీపీ ఓట్లు బదలాయింపు కాదన్నారు కానీ ఆమె రికార్డుస్థాయిలో గెలిచారు. చీపురుపల్లిలో బొత్సదే హవా అని ప్రచారం చేశారు కానీ కళా వెంకటరావు చేతిలో చిత్తయ్యారు. గజపతినగరంలో కొత్త నేత కొండపల్లి శ్రీనివాసరావుకు చాన్సేలేదని తేల్చేశారు. కానీ ఆయన మంచి విజయం సాధించి చంద్రబాబు కేబినెట్‌లో ఏకంగా మంత్రి అయ్యారు. విజయనగరంలో అదితి గజపతిరాజుకు కష్టమన్నారు ఆమె సూపర్ విక్టరీ సాధించారు. బొబ్బిలిలో బేబినాయన, ఎస్.కోటలో కోళ్ల లలితకుమారి గెలుపు ఊహించినదే. అయితే రికార్డు స్థాయి మెజార్టీతో గెలుస్తారనుకున్న కోండ్రు మురళీమోహన్ హవాను వైసీపీ కొద్దిగా తగ్గించగలిగింది. అంతకు మించి ఏమీ చేయలేకపోయింది.

కూటమి గాలికి వైసీపీ ఉఫ్!

- ఓడలు బండ్లు.. బండ్లు ఓడలు అయిన వైనం
- 2024 ఎన్నికల్లో ఎన్‌డీఏకి ఎదురులేని విజయం
- వైసీపీకి చేదు అనుభవం.. మట్టికరిచిన హేమాహేమీలు
- అనూహ్యంగా తెరపైకి కొండపల్లి శ్రీనివాస్, కలిశెట్టి







ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయి అన్న నానుడి జిల్లా రాజకీయాల్లో ఈ ఏడాది సాధారణ ఎన్నికల ఫలితాల్లో ప్రస్ఫుటమైంది. కూటమి ఎదురులేని విషయం సాధించింది. ఆ గాలి కొందరు అభ్యర్థులపై వాలి సులువుగా విజేతలను చేసింది. అదే సమయంలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. హేమాహేమీలు సైతం మట్టి కరవాల్సి వచ్చింది. ఈ చారిత్రక ప్రజా తీర్పు ద్వారా ఇద్దరు వ్యక్తుల భవిత ఊహించని మలుపు తిరిగింది. అనూహ్యంగా తెరపైకి వచ్చి.. టిక్కెట్లు పొంది.. గెలుపు వాకిట నిలిచారు. వారే కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. ఎన్నికల్లో గెలవడం ఓ మలుపు అయితే గెలిచాక మంత్రి కావడం ద్వారా శ్రీనివాస్ అందరినీ ఆశ్చర్యపరిచారు. మిగతా వారిలో కూడా కొందరికి ఊహాతీతంగా ఆధిక్యం నమోదైంది. జిల్లాకు జిల్లాయే క్లీన్‌స్వీప్ అయింది.

విజయనగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

సాధారణ ఎన్నికలకు ముందు విజేతలు ఎవరన్న దానిపై ఎన్నో వ్యాఖ్యానాలు, విశ్లేషణలు వెలువడ్డాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత ఎక్కువగా ఉన్నప్పటికీ జిల్లాకు జిల్లాయే కూటమి వైపు మళ్లుతుందని చాలా మంది పరిశీలకులు అనుకోలేదు. వైసీపీలో ఒకరిద్దరైనా గెలుస్తారని, కీలక నాయకులు స్వల్ప ఆధిక్యంతోనైనా గెలిచేయొచ్చునని భావించారు. కానీ అందరి అంచనాలు పటాపంచలయ్యాయి. గల్లీ నుంచి ఢిల్లీ దాకా కనీస ప్రాతినిధ్యం లేని కూటమికి తిరుగులేని విజయం దక్కింది. అందుకే 2024 టీడీపీ కూటమికి ప్రత్యేకమే. ఉమ్మడి జిల్లాలోని అన్నిస్థానాలు కూటమి పరం అయ్యాయి. జిల్లాతో సంబంధం ఉన్న మూడు పార్లమెంట్ స్థానాల్లో సైతం టీడీపీ కూటమి ఘన విజయం సాధించింది. రాష్ట్రంలో కూటమి క్లీన్‌స్వీప్ చేసిన జిల్లాల సరసన చేరింది.

ఆ ఐదేళ్లు వైసీపీదే..

2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాలను వైసీపీ చేజిక్కించుకుంది. అధికార పార్టీగా బరిలో దిగిన తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది. అటు విడిగా పోటీచేసిన జనసేన పెద్దగా ఉనికి చాటుకోలేకపోయింది. ఆ తరువాత జిల్లాలో ఏ ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేనలు కనీస ప్రాతినిధ్యాన్ని చాటుకోలేకపోయాయి. పంచాయతీ ఎన్నికల్లో సైతం వైసీపీది ఏకపక్షమే. ప్రాదేశిక ఎన్నికల్లో అయితే వైసీపీ జోరు, దూకుడు చూసి టీడీపీ పోటీ నుంచి తప్పుకుంది. జిల్లాలోని 27 మండలాలను వైసీపీ కైవసం చేసుకుంది. జడ్పీటీసీ స్థానాలు మూడింటిని ఏకగ్రీవంగా వైసీపీ గెలుచుకుందంటే ఆ పార్టీ జోరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మునిసిపల్ ఎన్నికల్లో అయితే టీడీపీ కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. విజయనగరం నగరపాలక సంస్థలో 50 డివిజన్లకుగాను ఒక్కచోట మాత్రమే టీడీపీ గెలుచుకుంది. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మునిసిపాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలోనూ వైసీపీదే హవా. ఎన్నిక ఏదైనా మాదేనంటూ వైసీపీ శ్రేణులు విజయగర్వంతో చెప్పేవి. కానీ 2024 ఎన్నికలు వైసీపీ గర్వానికి చెక్ పెట్టాయనే చెప్పవచ్చు.

బొత్స కుటుంబానికి చెక్..

బొత్స కుటుంబ హవాకు 2024 ఎన్నికలు చెక్ పెట్టాయి. 2019 ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి బొత్స సత్యనారాయణ, గజపతినగరం నుంచి ఆయన సోదరుడు బొత్స అప్పలనరసయ్య, నెల్లిమర్ల నుంచి సమీప బంధువు బడ్డుకొండ అప్పలనాయుడు గెలిచారు. మరో బంధువు మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇంకోవైపు బొబ్బిలి నుంచి ఎన్నికైన శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎస్.కోట నుంచి గెలిచిన కడుబండి శ్రీనివాసరావు.. ఇలా అందరూ బొత్స వర్గీయులే. పైగా జగన్ కేబినెట్‌లో బొత్స సత్యనారాయణ ఐదేళ్ల పాటు మంత్రిగా కూడా కొనసాగారు. పేరుకే ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులున్నా హవా అంతా బొత్స సత్యనారాయణదే. ఆ ఆధిపత్యానికి గండిపడింది. సంపూర్ణ విజయం నుంచి వైసీపీ పతనావస్థకు చేరుకుంది. చివరి నిమిషంలో రంగంలోకి దిగిన కళా వెంకటరావు సైతం సిట్టింగ్ మంత్రి బొత్సపై విజయం సాధించారు. ఆయన కుటుంబసభ్యులంతా (మిగతా 8వ పేజీలో...)

కాలుష్యం కాటేస్తోందా?





తీరంలో మృతి చెందిన తాబేళ్లు

- సముద్ర తీరంలో తాబేళ్ల కళేబరాలు
- సందర్శకులు, పర్యాటకుల ఆందోళన
- అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపం

భోగాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదంగా ఉండాల్సిన సాగర తీరం తాబేళ్ల కళేబరాలతో కళావిహీనమవుతోంది. వాటిని చూస్తున్న సందర్శకులు, పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడేంటని మత్స్యకారులు ఆశ్చర్యపోతున్నారు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 28 కిలోమీటర్ల పరిధిలో సాగర తీరం ఉంది. గోవిందపురం, ముక్కాం తదితర ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా పేరొందాయి. ప్రభుత్వం కూడా బీచ్‌ను అభివృద్ధి చేసేదిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో తాబేళ్ల కళేబరాలు చూస్తుండడం అందరినీ విస్తుగొలుపుతోంది. కాలుష్యం కారణంగానే అవి మృతి చెందుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఏటా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపో తుంటాయి. అటవీ అధికారులు తాబేళ్ల సంతతిని వృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుంటారు. తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి.. భద్రపరిచి.. పిల్లలయ్యాక తిరిగి సముద్రంలోకి విడిచి పెడుతుం టారు. ఇందుకోసం కోస్టల్ పరిధిలో అవుట్‌సోర్సింగ్ ద్వారా 25 మందిని నియమించినట్లు సమాచారం. అయితే తీరంలో తాబేళ్లు మృతి చెందుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యం కారణంగా తాబేళ్లు తీరం వైపుగా వస్తూ బండరాళ్లకు తగిలి మృతి చెందుతున్నాయని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. మత్స్యశాఖ ఎఫ్‌డీవో చాందినిని వివరణ కోరగా తాబేళ్ల సంరక్షణ ఫారెస్టు అధికారులు చూడాల్సి ఉందని, మృతి విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఇన్‌చార్జి ఫారెస్టు అధికారి ప్రసూన మాట్లాడుతూ కాలుష్యం కారణంగానే తాబేళ్లు మృతిచెంది ఉండొచ్చున్నన్నారు. ఒడ్డుకు వచ్చినప్పుడు కుక్కలు దాడి చేసే ఆస్కారం కూడా ఉందన్నారు. మృతిచెందిన తాబేళ్లను పాతి పెట్టాలని సిబ్బందికి సూచించామని తెలిపారు.

ఆ 5 కిలోమీటర్లు.. అంతే



రాజాం-విశాఖ రోడ్డు

- రోడ్డుపై నరకయాతన అనుభవిస్తున్న వాహన చోదకులు
- ఏడాది క్రితం రూ.3 కోట్లు మంజూరు

రాజాం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజాం-విశాఖ ప్రధాన మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.3 కోట్లు మంజూరై ఏడాది గడిచింది. ఇంకా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ చూపలేదు. ఫలితంగా రాజాం-విశాఖ మధ్య నిత్యం రాకపోకలు సాగించే వందలాది మంది నరకయాతన పడుతున్నారు. రహదారి ఎక్కడికక్కడే గోతులమయంగా మారింది. కొన్నిచోట్ల రహదారికి ఇరువైపులా రంధ్రాలు ఏర్పడి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుంతలు లేని రహదారుల కార్యక్రమంలో కూడా నిధులు మంజూరుకు స్థానం దక్కలేదు.

రాజాం-విశాఖ మార్గంలో కొత్తవలస జంక్షన్ నుంచి గార్రాజు చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని ఇప్పిలిపేట వరకూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర విస్తరణ, మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సుముఖత చూపలేదు. కాలక్రమంలో రహదారి దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వం గుంతల రహదారులుండకూడదన్న ఆలోచనతో రాజాం నియోజకవర్గంలో పలు మార్గాల అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించి కొనసాగిస్తోంది. అయితే ఇప్పటికే ఈరోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ రద్దు చేయకపోవడంతో కొత్త పథకంలో చోటు దక్కలేదు. ఈ రోడ్డు ఇంతేనా అని అటుగా వెళ్లే వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


- సంక్రాంతికి గ్రామాలకు వచ్చినవారు గుంతల రోడ్ల ఫొటోలు పోస్ట్ చేస్తే చర్యలు తప్పవని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించినా ఇక్కడి అధికారులు, నాయకుల్లో చలనం లేదు. ఏడాది క్రితం మంజూరైన రహదారి పనుల్ని కాంట్రాక్టర్ ప్రారంభించకపోయినా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. కనీసం పనుల రద్దుకు సిఫార్స్ చేయకపోవడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పరిస్థితిని ఆర్‌అండ్‌బీ ఈఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా రోడ్డు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- లారీని కారు ఢీకొని భార్య భర్త మృతి
- బాధితులంతా చెన్నై వాసులు
- తీర్థయాత్రలు చేస్తుండగా ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



యదుకుమార్(ఫైల్)



సాయిలీల(ఫైల్)

భోగాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లింగాలవలస సమీపంలో గురువారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఘటనలో నెల్లూరుకు చెంది చెన్నైలో స్థిరపడిన భార్యాభర్త నాగిశెట్టి సాయిలీల(72), యదుకుమార్ (83) అక్కడికక్కడే మృతి చెందారు. కోడలకు తీవ్ర గాయాలయ్యాయి. కళ్లదుటే తల్లిదండ్రులు మృతిచెందడం, భార్య తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లడం చూసి అశోక్‌బాబు తీవ్రంగా రోదిస్తున్నాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నెల్లూరుకు చెంది తమిళనాడు రాష్ట్రం చెన్నైలో స్థిరపడిన నాగిశెట్టి యదుకుమార్ కుటుంబం నాలుగు రోజుల కిందట తీర్థయాత్రలకు బయలుదేరారు. కారులో వారి కుమారుడు అశోక్‌బాబు, భార్య ప్రసన్న కూడా ఉన్నారు. చెన్నై నుంచి శ్రీకాకుళం వచ్చాక గురువారం అరసవల్లి, శ్రీముఖలింగం సందర్శించారు. అనంతరం సింహాచలం బయలుదేరారు. అటు తర్వాత చెన్నై తిరిగి ప్రయాణమవ్వాలని భావించారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం కారులో బయలుదేరాక భోగాపురం మండలం లింగాలవలస సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని, కారు బలంగా ఢీకొంది. ఆ దాటికి కారు ఒక పక్కభాగం నుజ్జునుజ్జయింది. వెనుక కూర్చున్న సాయిలీల కారులోనే మృతి చెందగా యదుకుమార్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి ప్రాణం వదిలారు. ముందు సీటులో ఉన్న ప్రసన్న తీవ్రంగా గాయపడింది. డ్రైవింగ్ చేస్తున్న అశోక్‌బాబు క్షేమంగా బయటపడ్డాడు. విషయం తెలిసి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాల పాలైన ప్రసన్నను క్షణాల్లో విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కళ్లదుటే తల్లిదండ్రులు మృతి చెందడం, భార్య గాయాలు పాలవడంతో అశోక్‌బాబు కొద్దిసేపు మిన్నకుండిపోయాడు. కొంత సమయం తరువాత తేరుకొని కన్నీటి పర్యంతమయ్యాడు. సీఐ ఎన్ని ప్రభాకర్, ఎస్ఐ సూర్యకుమారి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మళ్లీ అక్కడే..

గత నెల 30వ తేదీన ప్రమాదం జరిగిన స్థలానికి సుమారు 100 మీటర్ల దూరంలోనే ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్నకారు ప్రమాదానికి గురై నలుగురు మృతి చెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో అధిక ప్రమాదాలు జరుగుతుండడంతో జాతీయ రహదారి నిర్మాణంలో ఏదైనా లోపం ఉండొచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

డ్వామా పీడీగా శారదాదేవి

విజయనగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరుగా ఎస్.శారదాదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఎస్.కోట అదనపు పీడీగా విధులు నిర్వహిస్తూ పీడీగా నియమితులయ్యారు. ముందుగా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. శారదాదేవికి డ్వామా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జైలు నిర్మాణానికి స్థల పరిశీలన



జైలు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ రవికిరణ్

విజయనగరం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా జైలు నిర్మాణానికి జైళ్ల శాఖ కోస్తాంధ్ర డీఐజీ ఎంఆర్ రవికిరణ్ గురువారం స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జైలు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. విజయనగరం మండలం సారిక గ్రామ సమీపంలోని ఏడెకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణానికి పదెకరాలు అవసరమని, గ్రామ సమీపంలో ఏడెకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందన్నారు. స్థలం అనుకూలంగా వుందో లేదో పరిశీలన కోసం వచ్చినట్టు డీఐజీ రవికిరణ్ తెలిపారు. ఆయన వెంట జైళ్ల శాఖ ఇన్‌చార్జి ఎస్.శివప్రసాద్, సబ్ జైలు పర్యవేక్షణ అధికారి సంపత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

రబీ బీమాకు 5 రోజులే గడువు



- పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో నమోదుకు అవకాశం

శృంగవరపుకోట, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పంటల బీమాకు మరో ఐదు రోజులే గడువుంది. 2024-2025 సంవత్సరం రబీ పంటలు వరి, మొక్కజొన్న, మినుము, పెసరకు ఈ బీమా పొందవచ్చు. పంట నష్టం వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో ఈ సంస్థ బీమా పొందేందుకు పశ్చిమగోదావరి, శ్రీసత్యసాయి, విజయనగరం జిల్లాలకు మాత్రమే అవకాశం ఇచ్చారు.

రబీ వరి బీమా చేసుకొనేందుకు ఈనెల 31వరకు గడువు ఉంది. మొక్కజొన్న, మినుములు, పెసలు బీమా ఈనెల 15నాటికే ముగిసింది. తుపాన్‌లతో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వ ఈనెలాఖరు వరకు బీమా నమోదును పొడిగించింది. మీదగ్గరలో ఉన్న బ్యాంకు, సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్), మీసేవకు వెళ్లి మొబైల్ ద్వారా నేరుగా పీఎంఎఫ్‌బీవై (డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.పీఎంఎఫ్‌బీవై.జీఓవీ.ఇన్)లో నమోదు చేసుకోవచ్చు. బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం జిరాక్స్‌లతో పాటు పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. రబీ బీమా పొందిన వారికి ప్రభుత్వ ఇచ్చే పంట కోత ప్రయోగాల వివరాల ప్రకారం నిర్దిష్ట దిగుబడి కంటే తక్కువ వున్నట్లయితే నష్ట పరిహారం వర్తిస్తుంది.

పంటల బీమా ప్రీమియం

పంట	బీమా (ఎకరాకు)	బీమా చెల్లింపు(ఎకరాకు)
వరి	రూ.630	రూ.42,000
మొక్కజొన్న	రూ.540	రూ.36,000
మినుములు	రూ.300	రూ.20,000
పెసలు	రూ.300	రూ.20,000

మామిడి పంటకూ బీమా

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలకు సంబంధించిన బీమా చెల్లింపు గడువును కూడా నెలాఖరు వరకు పొడిగించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని(ఆర్‌డబ్ల్యుసీఐఎస్) మామిడి రైతుల కోసం అమలు చేస్తున్నారు. 2024 డిసెంబరు 15నుంచి 2025 మే నెలాఖరు వరకు నష్టపరిహారం అంచనా వేస్తారు. ఈ కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం తదితర వివరాలను మండల స్థాయిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్)ప్రతినిధులు లెక్కించి నష్టపరిహారం చెల్లిస్తారు. ఎకరాకు రూ.2 వేలు చెల్లిస్తే రూ.40 వేల పరిహారం వర్తిస్తుంది. ప్రీమియం చెల్లింపు, పరిహారం వర్తింపు మొత్తాలు ఒక్కో జిల్లాకు ఒక్కోలా ఉన్నాయి.

● రాజాం పట్టణానికి చెందిన ఓ మహిళ పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరింది. సుఖ ప్రసవం కాదని..తక్షణం ఆపరేషన్ చెయ్యాలని వైద్యులు సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు ముహూర్తాలు పెట్టే వ్యక్తి వద్దకు పరుగులు తీశారు. సరైన ముహూర్తం చూసుకొని ప్రసవం చేయించారు.

● ఓ మారుమూల గ్రామానికి చెందిన గర్భిణిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు కుటుంబ సభ్యులు. నొప్పులు రావడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రసవం చేయాలని భావించారు. కానీ అవి అమావాస్య ఘడియలని.. కొద్ది గంటల పాటు వాయిదా వేసుకుంటే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు కుటుంబ సభ్యులు. కొద్ది గంటల తరువాత ఆపరేషన్ చేసిన వైద్యులు ప్రసవం చేయించారు.

..జాతకాలపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ రెండు సంఘటనలూ ఉదాహరణలు.



సమయం కలిసొస్తేనే!

● ప్రసవానికి ముహూర్తం ● జాతకాలపై పెరుగుతున్న విశ్వాసం
● వారించలేకపోతున్న వైద్యులు ● ప్రమాదంలో తల్లీబిడ్డల ఆరోగ్యం

రాజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

..ఈ రెండు ఘటనలే కాదు. దాదాపు ప్రతి ఆస్పత్రిలోనూ నిత్యం ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. పుట్టిన బిడ్డ భవిష్యత్తు బాగుండాలనే అభిప్రాయంతో తల్లిదండ్రులు...కుటుంబ సభ్యులు ఇలా ప్రసవ సమయంలో ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఒక్కోసారి ఇది తల్లీబిడ్డల ప్రాణాల మీదకు వస్తోంది. దీనిని నిరోధించాల్సిన వైద్యులు సైతం మౌనంగా ఉంటున్నారు. ఫలితంగా ఈ ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరగడం లేదు. ప్రభుత్వాస్పత్రుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంటోంది. ఆస్పత్రిలో చేరిన తరువాత రక్తం తగ్గిందని... బిడ్డ ఉమ్మనీరు తాగేసిందని... బరువు ఎక్కువగా ఉందని... రక్తపోటు అధికమైందని... బిడ్డ అడ్డం తిరిగిందని ఇలా రకరకాల కారణాలు చెబుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు చివరకు ఆపరేషన్లకు ఒప్పుకుంటున్నారు. వేలాది రూపాయలు సమర్పించుకుంటున్నారు.

● నిత్య పర్యవేక్షణ అవసరం..

గర్భిణీని తొలి నుంచి పరిశీలించాలి. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పరీక్షలు చేయాలి. ఆశా కార్యకర్తలు నిత్యం పరిశీలించాలి. కానీ జిల్లాలో ఇవి జరుగుతున్న దాఖలాలు లేవు. శని, ఆదివారాలు వస్తే చాలు... ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు కనిపించడం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలి. కానీ అదీ చేయడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే చాలా మంది ప్రభుత్వ ఆస్పత్రుల ముఖమే చూడడం మానేస్తున్నారు. దీనిలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

● శిశువు ఆరోగ్యంపై ప్రభావం..

శిశువు శరీరంలో అన్ని అవయవాలు పూర్తి స్థాయిలో వృద్ధి చెందేందుకు 39 వారాల సమయం పడుతుంది. అప్పుడే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుంది. కానీ ఒక నెల ముందుగానే ప్రసవాలు చేస్తుండడంతో వారి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతుంది. శస్త్రచికిత్స ద్వారా ప్రసవించిన శిశువు బరువు తక్కువగా ఉంటుంది. ఊపిరితిత్తులు సరిగ్గా ఎదగవు. దీంతో శ్వాస సంబంధమైన సమస్యలు వస్తాయి. పచ్చకామెర్లతో పాటు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు సైతం సోకుతాయి. రోగ నిరోధక శక్తి అంతంత మాత్రంగానే ఉంటుంది. జీవితాంతం రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. గర్భిణీకి శస్త్రచికిత్స చేస్తే అందుకు గల కారణాలను రిపోర్టులో స్పష్టంగా రాయాలి. కానీ అనారోగ్య కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా శరీరంపై కత్తిగాట్లు పెడుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నా అత్యవసరమని చెప్పి శస్త్రచికిత్సలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో గత మూడేళ్లలో సాధారణ ప్రసవాలు 20 వేలకు మించి జరగలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

● చాలా ప్రమాదకరం..

ముందస్తు ప్రసవాలు ప్రమాదకరం. తల్లితో పాటు శిశువు ప్రాణానికి ప్రమాదమని తెలిస్తేనే ముందస్తు ప్రసవం చేయాలి. చివరి వరకూ సుఖ ప్రసవం కోసం వేచిచూడాలి. అప్పటికీ వీలు కాకపోతేనే ఆపరేషన్ చేయాలి. కానీ ఈ విషయం తెలియని చాలా మంది శస్త్ర చికిత్సలు చేసి తల్లీబిడ్డల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

-సునీత, గైనకాలజిస్టు, సామాజిక ఆస్పత్రి, రాజాం

మన్ వొహ్రా సెంచరీ... చండీఘడ్ సూపర్ విక్టరీ

● కొనసాగుతున్న విదర్భ విజయ పరంపర ● విజయ్ హజారే టోర్నీ



మ్యాచ్ ముగిసిన అనంతరం క్రీడాకారులు ఇలా..



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న చండీఘడ్ కెప్టెన్ మన్ వొహ్రా

విజయనగరం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే వన్డే టోర్నీలో విదర్భ విజయ పరంపర కొనసాగుతోంది. మరోవైపు చండీఘడ్ సునాయాస విజయం సాధించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానం, నగర శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో విజయ్ హజారే వన్డే టోర్నీ నిర్వహిస్తున్నారు. విజ్జీ క్రికెట్ మైదానంలో చండీఘడ్, మిజోరం జట్ల మధ్య గురువారం మ్యాచ్ జరిగింది. చండీఘడ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన మిజోరం జట్టు చండీఘడ్ బౌలర్ల ధాటికి 36 ఓవర్లలో 169 పరుగుల స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. చండీఘడ్ బౌలర్లు భారీ భాగస్వామ్యాలు నెలకొల్పనీయకుండా వికెట్లు పడగొట్టారు. మిజోరం బ్యాటర్లలో వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ అండర్సన్ (21), మిడిలార్డర్ బ్యాటర్ థంకుమా (21), వంత్రోత్‌లింగ (33 నాటౌట్), లోయర్ ఆర్డర్ బ్యాటర్ కేసీ కరియప్ప (41)లు మాత్రమే రాణించారు. అనంతరం 170 పరుగుల విజయ లక్ష్యంతో చండీఘడ్ బ్యాటర్లు అర్సలాన్ ఖాన్ (0) కెప్టెన్ మన్ వొహ్రా(101 పరుగులు) క్రీజులోకి వచ్చారు. తొలి బంతికే మొదటి వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన శివం బాంబ్రి (0), మిడిలార్డర్ బ్యాటర్లు తుషార్ జోషి (0), హార్దిక్ చౌదరి (0) డకౌట్ అయ్యారు. చండీఘడ్ జట్టు 13 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో జట్టును ఆదుకునే భారమంతా కెప్టెన్‌పై పడింది. మరో బ్యాటర్ ఎ.కె.కౌశిక్ (58 పరుగులు నాటౌట్)తో కలిసి ఇంకో వికెట్ కోల్పోకుండా అజేయంగా 160 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించాడు. ఒంటి చేత్తో జట్టుకు విజయాన్ని అందించిన మన్ వొహ్రాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో చండీఘడ్ జట్టుకు 4 పాయింట్లు లభించాయి.



చండీఘడ్-మిజోరం జట్ల మధ్య మ్యాచ్

● విదర్భ విజయం..

చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో విదర్భ-మిజోరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన మిజోరం జట్టు 30.3 ఓవర్లలో 80 పరుగులకే చాప చుట్టేసింది. విదర్భ జట్టు బౌలర్లలో వైఆర్ ఠాగూర్ 10 ఓవర్లలో 27 పరుగులు ఇచ్చి 4 వికెట్లు సాధించగా... హర్ష దూబే 5.3 ఓవర్లలో 7 పరుగులు ఇచ్చి 3 వికెట్లు సాధించాడు. బూటే 2, నల్కందే ఒక వికెట్ సాధించారు. మిజోరం జట్టు బ్యాటర్లలో సంజయ్ దేశాయ్ సాధించిన 15 పరుగులే అత్యధికం కావడం విశేషం. జట్టు ఓపెనర్ భూపెన్ లాల్వాని (10), రవికిరణ్ (10)లు మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. అనంతరం 81 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన విదర్భ జట్టు 18 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 83 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనింగ్ బ్యాటర్లు అథర్వ తైదే (2 పరుగులు), ధ్రువ్ సోరే (8 పరుగులు) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఆ తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కరుణ్ నాయర్ (44 పరుగులు), వైవీ రాథోడ్ (28 పరుగులు) అజేయంగా నిలిచి, 64 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు విజయాన్ని అందించారు. 4 వికెట్లు సాధించి... జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన విదర్భ బౌలర్ వైఆర్ టాగూర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

కొత్త ట్రాఫిక్ రూల్స్ ఇవే



గరుగుబిల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతోపాటు నూతన రహదారి భద్రతా నిబంధనలు కూడా ఈ నెలలో అమలులోకి వచ్చాయి. ఈ చట్టాల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. గతంలోనే మైనర్లు వాహనాలు నడిపి యాక్సిడెంట్లు చేస్తే పెద్దవారికి శిక్ష పడేలా ప్రభుత్వం నిబంధనల్లో మార్పు తీసుకువచ్చారు. కొత్త చట్టాల ప్రకారం ఇప్పుడు మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే ఏకంగా రూ.25 వేలు జరిమానా విధిస్తారు. దీంతో పాటు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు లైసెన్స్ పొందేందుకు అవకాశం లేకుండా ఆంక్షలు విధించారు.



జరిమానా ఇలా..

నిబంధనలు	గతంలో(రూ)	ప్రస్తుతం(రూ)
రెడ్‌లైట్ ఉల్లంఘన :	100	500
అథారిటీ ఆదేశాలను ధిక్కరించడం :	500	2000
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ :	500	5000
అతి వేగం :	400	1000
ప్రమాదకరమైన డ్రైవింగ్ :	1000	5000
డ్రంకెన్ డ్రైవ్ :	2000	10,000
రేసింగ్, స్పీడింగ్ :	500	5000
హెల్మెట్ ధరించకపోవడం :	100	1000
సీట్ బెల్ట్ ధరించకపోవడం :	100	1000
అత్యవసర వాహనాలను అడ్డుకుంటే :	---	10,000
బైక్‌పై త్రిపుల్ రైడింగ్ :	---	1200
ద్విచక్ర వాహనాలపై ఓవర్ లోడ్ :	100	2000
ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్ :	1000	2000

ఘనంగా మార్గశిర గురువారం పూజలు

పాలకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో మార్గశిర మాసం చివరి గురువారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ భక్తులతో పూజలు చేయించారు. అష్టోత్తర శతకలశాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, ముగ్రాటలు, పసుపు నీళ్లతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ హోమం నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొన్నారు. అర్చకులు వేమకోటి మణిల్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నమ్మండి.. ఇది రోడ్డే



దేవుబుచ్చింపేట వద్ద చెరువును తలపిస్తున్న మక్కువ-సాలూరు రోడ్డు



సాలూరు- మక్కువ రోడ్డులో గోతిలో నీరు

● చెరువులా మారిన సాలూరు-మక్కువ రహదారి
● అడుగడుగునా గోతులు

సాలూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నచందంగా ఉంది సాలూరు- మక్కువ రోడ్డు పరిస్థితి. గత ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి రూ.55.56 కోట్లు విడుదల చేసింది. అప్పట్లోనే పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. అడుగడుగునా గోతులతో నిండి... ప్రయాణికులు... వాహన చోదకుల సహనానికి పరీక్ష పెడుతోంది. దీంతో సాలూరు నుంచి మక్కువకు వెళ్లదలచిన వారు మామిడిపల్లి, శంబర మీదుగా చేరు కుంటున్నారు. ఈ రోడ్డు వెడల్పు చేయడంతో పాటు 32 కల్వర్టులు, 8 చిన్న వంతెనలు నిర్మించాల్సి ఉంది. కొన్ని కల్వర్టులు, చిన్న వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా చేతులెత్తేశారు. దీంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే దేవుబుచ్చింపేట, టి.బొడ్డ వలస, బాగువలస, పురోహితునివలస, వల్లా పురం, తాడిలోవ, పెదపథం తదితర గ్రామాల తో పాటు మక్కువ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి... ఈ రహదారిని నిర్మించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఆ దారీ అంతే..

గరుగుబిల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో వాహనదారులు నరకం చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారి మెరుగుకు చొరవ చూపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చిన్నపాటి గోతులకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులకు రూ.15 లక్షలు వెచ్చించినా ఫలితం కానరాలేదు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరమ్మతులు చేపట్టిన ప్రాంతాలు యథాస్థితికి చేరుకున్నాయి. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస నుంచి ఉల్లిభద్ర వరకు ఉన్న రహదారిలో అడుగడుగునా భారీగా గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలో చీకటి పడిందంటే ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి భారీ గోతులను పూడ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఉల్లిభద్ర సమీపంలో ప్రధాన రహదారిపై గోతిలో నీరు

పట్టణంలో వాకింగ్ జోన్లు

● కలెక్టరు అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టరు అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితంగా ఆరు నెలలు కాలంలో విజయనగరం పట్టణంలో వాయు కాలుష్యం సుమారు 2.5 శాతం తగ్గిందని కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జనవరి 1 నుంచి వాకింగ్ జోన్లు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. వాహనాలు కాలుష్య తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టరు ఆదేశించారు. పట్టణంలో డ్వాక్రా సంఘాల ద్వారా కొత్తగా ఐదు కాలుష్య తనిఖీ వాహనాలు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పట్టణంలో రెండు సోలార్ చార్జింగ్ స్టేషన్లను మహిళా సంఘాల అధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని ఒకేసారి 50 వేలు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఇంటికి ఖాళీ స్థలంలో నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ మూడు కార్యక్రమాలను జనవరి 26న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పొల్యూషన్ ఇంజనీరు సరిత, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య , ప్రాంతీయ రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మణిశంకర్ తదితరులు ఉన్నారు.

30న జాబ్ మేళా

గజపతినగరం డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళాను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించనున్నారని నిర్వాహకుడు కోట్ల సుగుణకరరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన గజపతినగరంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరంలోని సాయిసిద్ధార్థ కళాశాల ఆవరణలో ఈనెల 30న నిర్వహించనున్న జాబ్ మేళాలో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, కొండపల్లి భాస్కరనాయుడు, మక్కువ శ్రీధర్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

చీపురుపల్లి/గుర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం జమ్ము గ్రామానికి చెందిన డయేరియా బాధితులను టీడీపీ రాష్ట్రకార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. వారికి సరైన చికిత్స అందజేయాలని వైద్యులను కోరారు. ఆయన వెంట చీపురుపల్లి, గుర్ల నాయకులు రౌతు కామునాయుడు, వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు, కిరణ్ తదితరులున్నారు.

గుడికి శంకుస్థాపన

దత్తిరాజేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గడసాంలో బంగారమ్మతల్లి గుడి నిర్మాణానికి గురువారం శంకుస్థాపన నిర్వాంచారు. గ్రామ పెద్దలు మజ్జి మహేష్, నేతేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీవో బదిలీ

భోగాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండలంలోని ఏపీవో ఎం.ఆదిబాబుకు చీపురుపల్లి మండలం బదిలీ అయింది. మండలంలో నిర్వహించిన ఉపాధి పనుల్లో చాలావరకు అవకతవకలకు పాల్పడ్డారని సామాజిక తనిఖీల్లో బయటపడటం, ఆయనపై సర్పంచ్‌లు డ్వామా పీడీకి ఫిర్యాదు చేయడంతో బదిలీ జరిగినట్టు సమాచారం. చీపురుపల్లిలో ఏపీవో డి.బాగ్యలక్ష్మిని భోగాపురం ఏపీవోగా నియమితులయ్యారు.

గిరిజనులకు దుప్పట్లు

మెంటాడ (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 26:- మండలంలోని కొండలింగాలవలస పంచాయతీలో గిరిజనులకు ఆంధ్ర ఎస్‌ఐ సీతారాం గురువారం దుప్పట్లును పంపిణీ చేశారు. సుమారు రెండు వందల మంది గిరిజనులకు దుప్పట్లు వితరణ చేసారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చిన్నఅప్పన్న, ఎంపీటీసీ గుమ్మిడి ప్రవీణ్, గుమ్మిడి సింహాచలం పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన ఆల్తి బాబురావు తన తాత సన్నిబాబు జ్ఞాపకార్థం గురువారం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు వెళ్లి వాటిని అందజేశారు. కార్యక్రమంలో సన్యాసిదేముడు ఉన్నారు.

ఎఫ్‌ఏపై విచారణ

సంతకవిటి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.రంగారాయిపురంలోని ఉపాధి క్షేత్ర సహాయకురాలు ఇనముల సావిత్రమ్మ అవకతవకలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదు మేరకు ఎంపీడీవో సురేష్‌కుమార్, ఏపీవో హరినాథరావు గురువారం విచారణ చేపట్టారు. ఆమెకు బదులు ఆమె భర్త ఇనముల సీతాపతి విధులు నిర్వహిస్తున్నారని, వారు చేతివాటం చూపిస్తున్నారని స్థానికులు కలెక్టర్‌లో నిర్వహించిన మీకోసంలో ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు విచారణ మొదలు పెట్టారు. పలువురి నుంచి వివరాలు సేకరించారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

శృంగవరపుకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత ఆర్టీసీ లక్ష్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్ అప్పలనారాయణ అన్నారు. గురువారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ట్రాఫిక్, గ్యారేజ్, డంపింగ్ విభాగాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట డిపో మేనేజర్ కె.రమేష్, వేణు, నారాయణ తదితరులున్నారు.

ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 26: (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సర్కిల్ పరిధిలోని గంట్యాడ, విజయనగరం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేసులను సమీక్షించి దర్యాప్తు తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు సంకల్పంతో యువత, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్స్ వద్ద చర్యలు చేపట్టాలని స్టాపర్స్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పీఎస్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ లీలారావు, ఎస్‌ఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పీఎస్ ఆవరణలో మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ

మోసాలపై అప్రమత్తం చేయండి

గంట్యాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం ఆయన గంట్యాడ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన తర్వాత మహిళా సంరక్షకులతో సమావేశం నిర్వహించారు. తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోన్ యాప్‌లపై గ్రామాల్లో మహిళా సంరక్షకులతో అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, భూతగదాలు, గొడవలు, రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్థులు, గంజాయి రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్థానిక వ్యాపారుల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్‌ఐ సాయి కృష్ణ ఉన్నారు

క్రైం కార్నర్

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

గుర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జంగివలస గ్రామానికి చెందిన ఉక్కుడు మంజులవాణి (30) గురువారం పురుగు మందు ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు 11 ఏళ్ల కిందట వివాహమైంది. భర్త ట్రాక్టర్ డ్రైవర్. మద్యం తాగి వచ్చి రోజూ ఇంట్లో గొడవ పెడుతున్న నేపథ్యంలో తాగుడు మానేయడని పలుమార్లు మంజులవాణి భర్తను కోరింది. భర్తలో ఎలాంటి మార్పు లేకపోవడంతో బుధవారం రాత్రి గడ్డి మందు తాగింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆసుత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చెందింది. ఈ ఘటనపె ఎస్‌ఐ నారాయణరావు కేసు నమోదు చేశారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆటో నుంచి జారి పడి విద్యార్థి మృతి



సాయి భార్గవ (ఫైల్ ఫొటో)

చీపురుపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గునాన భార్గవసాయి (10 గురువారం ఆటో కింద పడి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెట్టపల్లి గ్రామానికి చెందిన గునాన ఈశ్వరరావు, గౌరి దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో పెద్దవాడు భార్గవసాయి చీపురుపల్లి లోని ఓ ప్రవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ ఆటోలో వెళ్లి వస్తున్న సాయి గురువారం కూడా ఎప్పటిలాగే తోటి పిల్లలతో కలిసి ఆటోలో బయల్దేరాడు. అలజంగి సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఆటోకు ఉన్న సేఫ్టీ రాడ్ తప్పింది. దీంతో ఆటో నుంచి జారి వెనుక చక్రం కింద పడిపోయాడు. తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడి మృత దేహం వద్ద బోరున రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎక్స్‌కవేటర్ దొంగ అరెస్టు

రామభద్రపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 20వ తేదీన ఎక్స్‌కవేటర్ దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. గురువారం ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన బద్రి హరికృష్ణ గతంలో ఒక ఎక్స్‌కవేటర్ కొనుగోలు చేశాడు. ఫైనాన్సు సరిగ్గా కట్టలేక పోవడంతో ఫైనాన్స్‌వారు అతడి ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుపోయారు. ఈక్రమంలో మండల కేంద్రంలో పార్కు చేసిన వేరే ఎక్స్‌కవేటర్‌ను హరికృష్ణ తీసుకొని వెళ్లిపోయాడు. ఈ ఎక్స్‌కవేటర్‌ను తెర్లాం మండలం డి.గదబవలస మామిడితోటలో దాచిపెట్టాడు. గురువారం ఎక్స్‌కవేటర్‌ను తీసుకు వెళ్లడానికి వచ్చి పక్కనే ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకుని వెళ్తుండగా, పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ వెలమల ప్రసాద్, ఏఎస్‌ఐ అప్పారావు, కానిస్టేబుల్ బాలి విశ్వేశ్వరరావ పాల్గొన్నారు.

ఆర్థికేతర వినతులను పరిష్కరించాలి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కార వేదికకు వస్తున్న వినతుల్లో ఆర్థికేతర వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా శతశాతం పరిష్కారించాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గ్రీవెన్స్ వినతులు పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు తదితర తక్షణమే పరిష్కరించలేని వినతులు విషయంలో ముందుగా ఆ పిర్యాదుదారుడికి అర్హత ఉందోలేదో చూడాలన్నారు. ఎప్పుడు మంజూరయ్యే అవకాశం ఉందో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలోని జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, కేఆర్‌సీ ఎస్‌డీసీ మురళి తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణపై ఆగ్రహం

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ అంబేడ్కర్‌ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించాని ఆస్పత్రులను సీజ్ చేయాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 20 పడకలకు పైబడి ఉన్న సుమారు 560 ప్రైవేటు ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పశుసంవర్థక ఆసుపత్రుల నుంచి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు.

ఫీజు మినహాయింపు కోరతాం

●జేసీ సేతుమాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

గుర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎల్‌పీఎంల సర్వే కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు దరఖాస్తు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జేసీ సేతు మాధవన్ తెలిపారు. మండలంలో లవిడాంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎల్‌పీఎం సబ్ డివిజన్‌ల కోసం రెవెన్యూ సదస్సులో అధికంగా వినతులు వస్తున్నాయని, ఫీజు మినహాయింపు ఇచ్చే అంశంపై తెలియజే స్తామన్నారు. సదస్సులో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న గొల్లలపేట రైతులు

రెవెన్యూ సదస్సు రసాభాస

విజయనగరం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లలపేట గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సు రసాభాసగా మారింది. తమ భూములు తమకు తెలియకుండానే అమ్మకాలు జరిగిపోయాయని, వాటిని తమకు అప్పగించి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులంతా గత ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వేతోనే భూ సమస్యలు పెరిగి తమ భూములు గల్లంతయ్యాయని, మరోసారి సర్వే చేయాలని అధికారులను కోరారు. దీంతో రైతులకు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఇరు వర్గాలు అందించిన డాక్యుమెంట్లు పరిశీలించి, విచారణ జరిపి న్యాయం చేస్తామని ఆర్‌ఐ రాజు తెలిపారు.

ఇంటర్ వర్సిటీ ఖో- ఖో పోటీలకు సూరిబాబు

విజయనగరం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఖో-ఖో పోటీలకు నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కడియం సూరిబాబు ఎంపికయ్యాడని హెచ్‌ఎం ఎస్.అప్పారావు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన పోటీలకు ఆంధ్రా వర్సిటీ జట్టుకు పాఠశాల విద్యార్థి సూరిబాబు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పీఈటీ సత్యప్రసాద్, ఉపాధ్యాయుడు కృష్ణ తదితరులు అభినందించారు.

వర్షం తక్కువ.. నష్టం ఎక్కువ



మదుపాడలో నేలకొరిగిన వరి పంట

గజపతినగరం డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా గతవారం రోజులుగా రెండు తుపాన్‌ల రూపంలో కురిసిన వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయాధికారులు తెలిపిన వివరాలు ప్రకారం వరి కోతలు కోసిన పిమ్మట పనలు పొలంలో ఉండిపోవడంతో సుమారు 8 ఎకరాల వరకు పంటనష్టం వాటిల్లింది. అలాగే మొక్కజొన్న పంట 370 ఎకరాలు, అపరాలు 250 ఎకరాల్లో నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. మండలంలోని 30 పంచాయతీల్లో వరి కుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. దానివల్ల ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

గజపతినగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. ఈమేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు చార్జీలు పెంచారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాథరావు ఉన్నారు.

బియ్యం కల్తీపై ఫిర్యాదు

భోగాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని ఓ దుకాణంలో కల్తీ బియ్యం ఉన్నట్టు దీనిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు వందనాల రమణ, బొలు త్రినాథ్, మాతా నవీన్, వరుపుల గిరి తదితరులు గురువారం రెవెన్యూ కార్యాలయంలో సీఎస్‌డీటీ బి.మురళికి ఫిర్యాదు చేశారు. బెల్ పేరుతో ఉన్న బియ్యం ప్యాకెట్ కొనగా అందులో పాలిష్ చేసిన రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సదస్సులు వినియోగించుకోండి

నెల్లిమర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ సేతు మాధవన్ అన్నారు. మండలంలోని సీతారాముడిపేటలో గురువారం నిర్వహించిప రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. సమస్యలను వినతుల రూపంలో తమకు తెలియజేస్తే పరిష్కార చర్యలు చేపడతామని అన్నారు. తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఆర్‌ఐ వేణుగోపాల్, రీసర్వే డీటీ సత్యనారాయణ, మండల సర్వేయర్ టి.దివ్యమానస పాల్గొన్నారు.

రంగా సేవలు ప్రశంసనీయం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాలకు వంగవీటి రంగా చేపట్టిన సేవలు ప్రశంసనీయమని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. ఈమేరకు గురువారం రంగా వర్ధంతిని జీఎస్‌ఆర్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసైనికులు రాజేష్, మహేష్, పవన్‌కుమార్, వంశీ, భార్గవ్, అభిలాష్, హిమంత్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురుపల్లిలో గురువారం వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతి జనసేన ఆధ్వర్యంలో జరిగింది. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందక బాల, వై.లక్ష్మనాయుడు, రేగాన అప్పలనాయుడు, స్వామినాయుడు, సత్యాజీ, రమణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలసలో పెరిగిన నీటిమట్టం

వంగర డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు నాలుగు రోజులుగా మడ్డువలస రిజర్వాయర్‌కు వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి జల ప్రవాహం పెరిగింది. గురువారం ఉదయం వరకు 64.15 మీటర్లు ఉన్న నీటి మట్టం ఒక్కసారిగా పెరిగి 64.50 మీటర్లకు పెరిగింది. నదుల ద్వారా 150 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండటంతో ఆధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే ప్రధాన గేట్లు తెరిచి నాగావళిలోకి నీరు విడుదల చేస్తామన్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయండి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని సీఐటీయూ ప్రతినిధి జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కుమారి, రమ, ఈశ్వరమ్మ, రామచంద్రరావు, రాఘవ, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌కు స్త్రీనిధి రుణాలు ఇవ్వండి

విజయనగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకం అమలుకు ఎస్సీ, ఎస్టీలకు స్త్రీనిధి నుంచి రుణాలను మంజూరు చేయాలని స్త్రీనిధి ఎండీ హరిప్రసాద్‌ను కలెక్టర్ అంబేద్కర్ కోరారు. ఈమేరకు గురువారం జిల్లాకు వచ్చిన ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్వయంశక్తి సంఘాల్లో సుమారు 55 వేల మంది ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉన్నారని, వారికి సూర్యఘర్ రుణాలు మంజూరు చేయాలన్నారు.

బాక్సింగ్ అసోసియేషన్‌కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇదే..

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తోటపాలెంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా నూతన కార్యదర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అసోసియేషన్ కార్యనిర్వహక అధ్యక్షుడిగా అవనాపు విజయ్, అసోసియేషన్ చైర్మన్‌గా ఐవీపీ రాజు, కార్యదర్శిగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా ఎ.సంతోష్, కాళ్ల మహేష్, సహాయ కార్యదర్శిగా లావేటి మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, కోశాధికారిగా హేమశంకర్, సభ్యులుగా గౌరీ, మీసాల గీత, మద్దిల నారాయణ, బోని రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అవనాపు విజయ్ మాట్లాడుతూ విజయనగరంలోని అసోసియేషన్‌కు శాప్ ఎఫిలియేషన్ లేకపోవడంతో క్రీడాకారులు రాష్ట్రం దాటి ఆడినా ఉద్యోగ నియామకాల్లో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ కూడా నిర్వహిస్తామన్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ బస్టాండ్‌లోని కనకమహాలక్ష్మీ ఆలయంలో మార్గశిర మాసం చివరి గురువారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

మోనటరింగ్ టీం సందర్శన

గుర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ అకడమిక్ మానటరింగ్ టీం గురువారం పెనుబర్తి, కలవచర్ల కస్తూర్బా విద్యాలయాలు, గుర్ల పాఠశాలను సందర్శించింది. రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. సామర్థ్యాల పెరుగుదలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్.జగన్, ఏఎస్‌వో కె.గాయత్రి, ఎంఈవో భానుప్రకాష్, సీఆర్‌పీలు సూర్యనారాయణ, బంగారునాయుడు పాల్గొన్నారు.

సీపీఐకి వందేళ్లు



నినాదాలు చేస్తున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శతాబ్ద కాలంగా పేద, బడుగ, బలహీన వర్గాలు, కర్షకులకు అండగా ఉంటోందని జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ అన్నారు. ఈమేరకు గురు వారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. జిల్లా సహా య కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రమణ హాజరై మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల నిర్బంద కాండకు, నిరంకుశతత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐ అవిర్భవించిందన్నారు. వీరోచిత పోరాటాలు మహోన్నత త్యాగాలు, మహత్తర విజయాలకు సీపీఐ ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు బుగత అశోక్, రంగరాజు, జగన్నాథం, ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధి సునీల్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

విజయనగరం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుకొండ సైనిక స్కూల్ విద్యార్థులకు ఉపకార వేతనాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పైలా గజేంద్రరావు ప్రకటనలో తెలిపారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ఉపకార వేతనాలను విడుదల చేయాలని కోరారు.

కార్యదర్శుల మండల అధ్యక్షుడుగా జగదీశ్

జామి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా అన్నంరాజుపేట పంచాయతీ కార్యదర్శి ఎం.జగదీశ్ ఎన్నికయ్యారు. ఎంపీడీవో అప్పలనాయుడు, ఈవోపీఆర్‌డీ ఉమ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా సురేంద్రకుమార్, శివకుమారి, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు, కోశాదికారి రమణరావు, సహాయకార్యదర్శిగా ఎం.వి.ఎస్.ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత

● తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోకి వెళ్లేందుకు ఇక్కట్లు

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిత్యం ఇదే సమస్య

శృంగవరపుకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇదేదో కార్లు షోరూం కాదు. శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణం. భూముల రిజిస్ట్రేషన్‌లు చేసుకునేందుకు వచ్చిన వారు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే కాంపౌండ్‌లో ఉన్న తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఈ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన వారు విసుక్కున్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూ సదస్సుల పరిశీలనకు కలెక్టర్ అం బేద్కర్ మండలానికి వస్తున్నారనే సమాచారం రెవెన్యూ అధికారులకు అందడంతో వారు ఆందోళన చెందారు. కార్యాలయం దారికి అడ్డంగా కార్లు నిలిపి ఉండటంతో భయపడ్డారు. అదే విషయాన్ని సబ్ రిజిస్ట్రార్‌కార్యాలయ అధికారులకు తెలిపారు. దారికి అడ్డంగాకార్లు లేకుండా చూడాలని కోరారు. అయినప్పటికీ సాయంత్రం వరకు కార్లన్నీ అలాగే అడ్డదిడ్డంగా ఉన్నాయి. కొద్దిరోజుల కిందట నియోజకవర్గంలో రోడ్ల గుంతలను పూడ్చే అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు వస్తారన్న సమాచారంతో కలెక్టర్, ఎస్పీ తదితరులు ఇక్కడ ఏర్పాట్లు పరిశీలనకు వచ్చారు. ఈ సమయంలో కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఇదే సీన్ జరిగింది. అప్పుడు కూడా అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలను తీయించేందుకు అధికారులు పడరాని పాట్లు పడ్డారు. ఈనేపథ్యంలో రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట కారు పార్కింగ్ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

కూటమి గాలికి.. వైసీపీ ఉఫ్!

(ఐదో పేజీ తరువాయి)

ఓడిపోయారు. చివరకు విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీలక్ష్మికి సైతం పరాభవం తప్పలేదు.

అనూహ్యంగా తెరపైకి వచ్చిన కొండపల్లి, కలిశెట్టి..

జిల్లా రాజకీయాల్లో ఊహించని విధంగా అనూహ్యంగా కొండపల్లి శ్రీనివాస్, కలిశెట్టి అప్పలనాయుడు తెరపైకి వచ్చారు. కొండపల్లి శ్రీనివాస్ తండ్రి కొండపల్లి కొండబాబు ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందు వైసీపీలో వున్నారు. నోటిఫికేషన్ వస్తుందనుకుంటున్న సమయంలో ఆయన టీడీపీలో చేరారు. ఊహించని విధంగా గజపతినగరం నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును తన కుమారునికిగా దక్కించుకున్నారు. అంతే కాకుండా గెలిచిన తరువాత మంత్రివర్గంలో కూడా జిల్లా నుంచి బెర్తును కన్‌ఫర్మ్ చేయించుకున్నారు. మరోవైపు విజయనగరం ఎంపీ సీటు ఎవరికి వరిస్తుందని చర్చలు జరుగుతున్న దశలో ఎచ్చెర్ల ప్రాంతానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీగా ఎన్నికల బరిలో దిగారు. మంచి మెజార్టీతో విజయం సాధించారు.

కంగుతిన్న కోలగట్ల..

విజయనగరం నియోజకవర్గంలో తండ్రి పోటీ చేస్తారా? లేక కుమార్తె అదితిగజపతిరాజు పోటీ చేస్తారా? అన్న ఉత్కంఠకు తెరదించి అదితి అభ్యర్థిగా బరిలో దిగారు. విజయం సునాయసమని అనుకున్న కోలగట్లకు గట్టి షాక్ ఇచ్చారు. అశోక్ గజపతిరాజుకి సైతం ఎప్పుడూ లభించని మెజార్టీ ఆయన కుమార్తె అదితికి దక్కింది.

వారు ఒకటి తలిస్తే..

ఈ ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో నెల్లిమర్ల నుంచి కర్రోతు బంగారాజు, చీపురుపల్లి నుంచి కిమిడి నాగార్జున, గజపతినగరం నుంచి డాక్టరు కెపి నాయుడులు ఎమ్మెల్యే సీటు ఆశించారు. నెల్లిమర్ల సీటును జనసేనకు కేటాయించారు. చీపురుపల్లి విషయానికి వస్తే ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీకి కేటాయించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కళా వెంకటరావుకు ఇవ్వాల్సి వచ్చింది. ఇక కెపి నాయుడు కుటుంబం నుంచి ఆయన అన్న కుమారుడు కొండపల్లి శ్రీనివాస్‌కు టిక్కెట్ కేటాయించడంతో కేపి నాయుడికి అవకాశం దక్కలేదు. అదే విధంగా శృంగవరపుకోట నుంచి గొంప కృష్ణ సీటు ఆశించారు. కాని సీనియర్ అయిన కోళ్ల లలితకుమారికి ఇక్కడి టిక్కెట్ కేటాయించారు. నామినేటెడ్ పదవుల విషయానికి వస్తే జిల్లా నుంచి కర్రోతు బంగార్రాజుకు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పదవి వరించింది. కిమిడి నాగార్జున, కెపి నాయుడు, గొంప కృష్ణ తదితరులు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.

వైసీపీ వైఫల్యాలు ఇవీ..

2019 నుంచి 2024 వరకు అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు, ప్రతిపక్ష పార్టీలపై కక్షసాధింపు చర్యలు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు తదితర అంశాలు ఎన్నికల్లో బాగా పని చేశాయన్నది పరిశీలకుల మాట. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడం, రోడ్లు బాగా లేకపోవడం, విద్యుత్ చార్జీల పెంపు, డీఎస్సీ నియామకాలు చేపట్టకపోవడం, అంగన్‌వాడీ, ఆశావర్కర్ల నిరసనలతో పాటు ప్రభుత్వపై వ్యతిరేకత కూడా 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమికి కారణం.

డీలరు పోస్టులకు రాత పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డిపో డీలరు పోస్టుల భర్తీ కోసం గురువారం స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 32 డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 121 మంది అభ్యర్థులు ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 101 మంది పరీక్షకు హాజరు కాగా, వారిలో 20 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు, సీఎస్‌డీటీలు రెడ్డి సాయికృష్ణ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

పకడ్బందీగా నిర్వహణ

పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించినట్టు ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు. ప్రతి రేషన్ డిపో పరిధిలో 800 కార్డులు దాటిన పక్షంలో అలాంటి చోట అదనంగా మరో డీలరు పోస్టు కోసం నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అలా గజపతినగరం, పురిటిపెంట గ్రామాల్లో రెండు డీలరు పోస్టు మంజూరు కావడంతో అక్కడి వారు కోర్టుకు వెళ్లారన్నారు. దీంతో అక్కడ పరీక్షను నిలిపివేశామని ఆర్డీవో తెలిపారు. వచ్చే నెల 1 నుంచి కొత్త డీలర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండలాల సీఎస్‌డీటీలు రెడ్డి సాయికృష్ణ, శశికళ, స్వర్ణలత, సత్యనారాయణ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్, స్టాఫ్‌నర్సుగా పనిచేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన అర్హత కలిగిన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎం.ఫ్లోరెన్స్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద గల జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ గానీ జీఎన్ఎం గానీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రామభద్రపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు. శ్రీరాంనగర్ కాలనీలో 15 రోజులపాటు నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కొల్లి భాస్కరరావు, బెల్లాన క్రాంతికుమార్ మాట్లాడారు. భోగిరోజు ఫైనల్ మ్యాచ్ ఉంటుందని, ప్రథమ విజేతకు షీల్డుతోపాటు పాటు రూ.20వేలు ఇస్తామని చెప్పారు. ప్రతిరోజూ మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌దా సిరీస్, షీల్డ్ ఇస్తామన్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌కు బహుమతి ఇస్తామన్నారు. ఈనెల 29న ప్రారంభమవుతున్న ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికీ 60జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు, బెల్లాన రవికుమార్, రామ్‌దేవ్‌గోపాల్, నల్లి త్రినాథరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

రామభద్రపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బొప్పె రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఏపీటీఎఫ్ కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. పీఎఫ్‌లోను, ఏపీజీఎల్ లోన్లు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ అప్పలనాయుడు, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.సత్యారావు, ముసలయ్య, ఎం.కృష్ణంనాయుడు, కాంతారావు, వెంకటరమణ, డోకల రఘురాంనాయుడు, కె.గణేష్, సింహాచలం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నీటితో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి

- రెండు మోటార్లు ఉన్నా పనిచేయని వైనం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న జనం

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నుంచి మల్లమ్మపేట గ్రామానికి గల రైల్వే అండర్ బ్రిడ్జిలో రోజుల కొద్దీ వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో స్థాని కులు రాకపోకలకు అవస్థలు పడుతున్నా రు. వర్షాల సమయంలో అండర్ బ్రిడ్జిలో చేరిన నీటిని బయటకు తోడేందుకు మున్సిపాలిటీ రెండు మోటార్లను ఏర్పాటు చేసింది. అయితే ఈ రెండు మోటార్లు ఒకేసారి మూలకు చేరాయి. దీంతో ప్రజల కు అవస్థలు తప్పడం లేదు. ఇటీవల నాలుగైదు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అండర్ బ్రిడ్జిలో వరదనీరు చేరుకుంది. దీంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. ఆర్‌యూబీపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆ వార్డు కౌన్సిలర్ ఇంటి గోవిందరావు, కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముద్దల శ్రీనివా సరావు, మల్లమ్మపేట గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరమ్మతులు చేస్తున్నాం

ఆర్‌యూబీలో నీటిని తోడేందుకు విద్యుత్ మోటారు, డీజిల్ మోటార్లు ఉన్నాయి. రెండు మోటార్లు ఒకేసారి పాడైపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. మోటార్ల మరమ్మతులను చురుగ్గా సాగిస్తున్నాము. సమస్య వెంటనే పరిష్కారమవుతుంది.

– కిరణ్, మున్సిపల్ డీఈఈ, బొబ్బిలి



బొబ్బిలి రైల్వే అండర్ బ్రిడ్జిలో నిల్వఉన్న వర్షపు నీరు

ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్

బొబ్బిలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీల వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని జిల్లా డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీవో) కిరణ్‌కుమార్ తెలిపారు. కోమటిపల్లి, కలవరాయి గ్రామాల ఎస్సీ, ఎస్టీ జాబితాను గురువారం స్థానిక సచివాలయ నోటీసు బోర్డులో ఆయన ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి 31వ తేదీ వరకు ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే వీఆర్వో స్వీకరిస్తారని, జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10వ తేదీన తుది వివరాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న నందు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఒడిస్సా రాష్ట్ర శంబల్‌పూర్‌కి చెందిన కె.నందు అనే యువకుడు సైకిల్ యాత్ర చేపట్టారు. 2023 సెప్టెంబరులో శంబల్‌పూర్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించి, భారతదేశంలో చాలా ప్రాంతాలను పర్యటించి, తిరుగు ప్రయాణంలో గురువారం బొబ్బిలి చేరుకున్నారు. ఈసందర్భంగా బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమా ర్, ఆ యువకుడిని కలిసి అభినందనలు తెలిపి, ఆర్థిక సహాయం చేశారు.

ఘనంగా బాక్సింగ్ డే

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా క్రిస్మస్ మరుసటి రోజున క్రైస్తవులు బాక్సింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులోని భాగంగా స్థానిక మహారాణిపేటలో గల పరిశుద్ధ ఆంద్రూస్ లూథరన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ జాన్‌విక్టర్, జేసీ రాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఆత్మీయులకు, బంధువులకు బహుమతులను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన ర్యాలీ

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం ఉదయం బొబ్బిలిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ డివిజన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధి లోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులంతా పాల్గొంటారని చెప్పారు.

నర్సిపురం భూముల పరిశీలన

పార్వతీపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నర్సిపురం గ్రామ రైతులు తమ ప్రాంతానికి చెందిన భూముల విలువలను పెంచవద్దని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి స్పందించి గురువారం నర్సిపురం భూములను పరిశీలించారు.

జైళ్లశాఖ డీఐజీ సందర్శన



పాలకొండ: సబ్ జైలును పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సబ్‌జైలును ఆ శాఖ డీఐజీ రవికిరణ్ గురువారం తనిఖీ చేశారు. జైలులో గల రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని, ఆహారాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన జైలు భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు రామన్నదొరవలస టిడ్కో కాలనీ సమీపంలో స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ఇందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదలైన వెంటనే నిర్మాణాలకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌జేవో శివప్రసాద్, స్థానిక సబ్‌జైలు సూపరింటెండెంట్ జి.సీతారాంపాత్రో, సిబ్బంది పాల్గొన్నారు. ● పాలకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్ జైలును జైళ్లశాఖ డీఐజీ ఎం.రవి కిరణ్ గురువారం సందర్శించారు. జైలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టోర్‌రూం, బాత్‌రూమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌జైలు ప్రాంగణంలో మొక్కలు నాటారు. జైల్లో ఉన్న ముద్దాయిల యోగ క్షేమాలను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సాధారణ తనిఖీల్లో భాగంగా పాలకొండ సబ్‌జైలును సందర్శించినట్టు తెలిపారు. జిల్లా జైలు శాఖాధికారి కె.మోహన్‌రావు, జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెడ్‌వార్డర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలి

కొమరాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సమీపి స్తున్న నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలని పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన పోలీసులను ఆదేశించారు. కొమరాడ పోలీస్‌స్టేషన్‌ను ఆమె గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కోడి, గొర్రె పందాలు, పేకాట, సారాపై గట్టి నిఘా ఉంచాలని ఎస్ఐ నీలకంఠంను ఆదేశించారు. అనంతరం పలు కేసుల్లో పట్టుబడిన 670 మద్యం సీసాలు, 825 లీటర్ల సారాను ధ్వంసం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

సీతానగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బలగ రమణమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. శాఖలవారీగా ఎంపీపీ రమణమ్మ సమీక్ష నిర్వహించారు. వెంగళరాయసాగర్ 18ఎల్ కాలువ ద్వారా రామవరం, అంటిపేట గ్రామాల మధ్య కల్వర్టు ఉండాలని పలుమార్లు రైతులు తెలియజేసినప్పటికీ కనీసం స్పందించలేదని ఇరిగేషన్‌శాఖపై టీడీపీ మండల అధ్యక్షుడు, రామవరం సర్పంచ్ పెంట సత్యంనాయుడు, మరికొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా వేసిన పైపులు సరిగా పనిచేయడం లేదని తామరకండి, లక్ష్మీపురం, పెదంకలాం, క్రిష్ణరాయపురం సర్పంచ్‌లు గ్రామీణ నీటి పారుదలశాఖ అధికారులను నిలదీశారు. పాడి పశువుల సంరక్షణకు గోశాలల నిర్మాణాల కోసం 30 మంది రైతులు సచివాలయ పశు సంవర్థక శాఖ సహాయకులకు దరఖాస్తులు అందించారని, వీరిలో ఒక్కరికి మాత్రమే గోశాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారని లచ్చయ్యపేట ఎంపీటీసీ, లక్ష్మీపురం సర్పంచ్‌లు ఉపాధి ఏపీవోను నిలదీయగా సమాధానం చెప్పలేకపోయారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, ఎంపీడీవో వి.త్రివిక్రమరావు, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి కుమార్‌వర్మ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోలు

పార్వతీపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సొంత వ్యాపారం చేస్తున్న, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న దివ్యాంగులు మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉంటే పెట్రోల్ సబ్సిడీకి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హతలున్న దివ్యాంగులు.. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్ణీత దరఖాస్తు ఫారం పూర్తి చేసి సదరం సర్టిఫికెట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్ల రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం, రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం మొదటి పేజీ, ఆధార్‌కార్డు, ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువీకరణపత్రం, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో సమర్పించాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 08942-240519 నెంబర్‌కు కార్యాలయ పనివేళలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



బొబ్బిలి రూరల్: సీపీఐ జెండా ఎగురవేస్తున్న దృశ్యం

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందవ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక జెండామహల్ సెంటరులో గురువారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది కండాపు ప్రసాదరావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, బాబ్జీ, వెంకటసత్యనారాయణ, ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందవ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని దీవెనవలస, రామన్నవలస, కృపావలస గ్రామల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, కార్యదర్శులు సీహెచ్ బిహెన్, సీహెచ్ లచ్చన్న, సీతయ్య, సి.జీరా, ఎం.అప్పన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాల్టీ పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ గ్రోత్‌సెంటరు నుంచి పట్టణానికి వచ్చే మల్లమ్మపేట ఫీడరులో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆవాల అనంతరావు తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, మిలటరీ కాలనీ, ఐటీఐ కాలనీ, రాజమహల్ కాలనీ, మల్లమ్మపేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రత్యామ్నాయ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తమ సిబ్బందితో వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

బొబ్బిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధనుర్మాసంలో మార్గశిర గురువారం, సఫల ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. సమరసతా ఫౌండేషన్ ధర్మ ప్రచారంలో భాగంగా ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో సందడిగా నిర్వహించారు.



వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట కోలాటం ఆడుతున్న దృశ్యం

న్యూస్ బాక్స్

చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

పార్వతీపురంటౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రహదారికి ఆనుకుని ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా బళ్లతో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజును స్థానిక చిరు వ్యాపారులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్‌ను కలిసి తమ బాధలు వెల్లడించారు. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ పోలీసుశాఖతో చర్చించి, వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించేలా పరిశీలిస్తామన్నారు.

రెవెన్యూ యూనియన్ నూతన కార్యవర్గం

వీరఘట్టం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారుల సంఘం యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా భానూరు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా పాలవలస నగేష్, ఉపాధ్యక్షుడిగా ఊర్లక దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా చక్రధర్, జాయింట్ కార్యదర్శిగా సాయిరాం, ట్రెజరర్‌గా చీపురుపల్లి ప్రభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరికీ తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

31న డీఎస్‌పీసీఏ సమావేశం

పార్వతీపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జంతువులపై క్రూరత్వం నియంత్రణ కమిటీ సమావేశం ఈనెల 31న నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్థక అధికారి ఎస్.మన్మథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో 31వ తేదీ ఉదయం 11గంటలకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

పాలకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమ్మె ఒప్పందాలు అమలు చేయనందున దశల వారీగా పోరాటాలు చేస్తామని తెలిపారు. పి.శ్రీదేవి, విమల, మధు, వి.ఆంజనేయులు పాల్గొన్నారు. ● సాలూరు: మున్సిపల్ ఉద్యోగులకు సమ్మె కాలంలో చేసిన ఒప్పందాలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

వీరఘట్టం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీలానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను డీఈవో నల్ల తిరుపతినాయుడు గురువారం ప్రారంభించారు. ఈ పాఠశాలలో 1989 బ్యాచ్‌కు చెందిన కొరికాన రవికుమార్ ఆర్థిక సాయంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. అనంతరం డీఈవో.. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి, ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు, హెచ్ఎం జి.రవి ప్రసాద్‌పాల్గొన్నారు.